వాటి తీవ్రతకే ఈ వ్యవస్థ ఉపయోగపడుతోంది. ఈ సమస్యలకు మూలకారణం అయిన శ్రమ, దోపిడిని తొలగించే సోషలిస్టు వ్యవస్థకు ప్రధాన పునాది ప్రైవేటు ఆస్తులను ప్రభుత్వపరం చేయటం. కాబట్టి మనం ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి. ఇప్పుడు మనం తేల్చుకోవాల్సింది శ్రమ దోపిడి మీద నడుస్తూ, అనేక సామాజిక రుగ్మతలూ నిరుద్యోగం, దారిద్ర్యం, నిరక్షరాస్యత, హింస, వ్యభిచారం అనారోగ్యం వంటి వాటికి కారణభూతమైన పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండాలా? లేక అటువంటి సామాజిక రుగ్మతలు లేని, అందరికీ సమాన అవకాశాలు కల్పించేటి, అందరి ఆత్మ గౌరవాన్ని కాపాడునటువంటి సోషలిస్టు వ్యవస్థ కావాలా? సోషలిస్టు వ్యవస్థను కోరుకునే వాళ్ళు ప్రైవేటీకరణను వ్యవతిరేకించాల్సిందే.

కాబట్టి తమ ప్రయోజనాల కోసం హెల్పర్లు, రైల్వే క్యాటరింగ్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి. అందుకోసం ధృఢచిత్తంతో నిలబడాలి.

# ఉద్యమించడమే సమస్యకు పరిష్కారం

డా॥ బాలగోపాల్

రైల్వే యాజమాన్యం క్యాటరింగ్ డిపార్ట్‌మెంటు గురించి ఏం చేయబోతుందో స్పష్టంగా తెలియటం లేదు. ప్రైవేటీకరించే క్రమంలో అన్ని విషయాలను అస్పష్టంగా ఉంచటం ఒక లక్షణంగా మారింది. ఇంతవరకు, ఏ ప్రాతిపదిక మీద ప్రైవేటీకరణ చేస్తారో చెప్పరు. ఇది చాలా అన్యాయమైన పద్ధతి. విద్యుత్తు రంగంలో, ఇంకా అనేక రంగాలలో ఈ విధంగా జరిగింది. ఇది చాలా అన్యాయమైన పద్ధతి. ఇలా దాచిపెట్టి, దాచిపెట్టి, ఆఖరు దశలో కార్మికుల మీద రుద్దుతారు. ప్రభుత్వాలు ప్రతిసారి, తరుచుగా 'పారదర్శకత' 'పారదర్శకత' అంటారు. కాని చెప్పే మాటలకు, ఆచరణకు పొంతనే లేదు.

కేటరింగ్ అవసరాలను తీర్చటానికి ఏదో ఒక నిర్మాణం ఉండాల్సిందే. ఆ అవసరాలను ప్రయాణికుల దగ్గరకు చేర్చేందుకు హెల్పర్స్ (మనుష్యుల) అవసరం తప్పని సరి. అయితే ఇప్పుడున్న హెల్పర్స్‌ను ఏం చేయిబోతున్నారో, ఎందుకుంచకూడదో స్పష్టత లేదు.

ఇంతకు ముందు కోర్టుల మీద నమ్మకముండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు, ఉదాహరణకు బాల్కో కంపెని గురించి సుప్రీం కోర్టు యొక్క అభిప్రాయం చూస్తే ఇది స్పష్టమవుతోంది. విధాన నిర్ణయాలతో మాకు సంబంధం లేదంటున్నాయి. ప్రభుత్వాల దయా దాక్షిణ్యాలకు వదిలి వేస్తున్నాయి. ఆ విధంగా కార్మికులను 'మీ చావు మీరు చావండి'' అంటోంది. ఇవే కోర్టులు, ఉదాహరణకు పదేళ్ళు క్రిందట సుప్రీం కోర్టు అన్ ఫెయిర్ (unfair) యాజమాన్యం అని తీర్పులు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ అవకాశాం తక్కువ. కాబట్టి హెల్పర్స్ ఉద్యమ రూపంలో కొనసాగితేనే దారి ఉన్నది.

కొట్లాడితేనే మీకు యూనిఫారంలు, ఐడెంటిటి కార్డులు దొరుకుతున్నాయి. కాబట్టి ప్రధాన మైన యూనియన్ల మీద ఒత్తిడి తీసుకొనిరావాలి. ప్రధాన యూనియన్లు వీటి మీద స్పందించాలి. ఒక విధాన పరమైన పాలసి కొరకు ఈ యూనియన్లు రైల్వే యాజమాన్యం మీద ఒత్తిడి తీసుకొనిరావాలి.

వాస్తవానికి చట్టం ప్రకారం నిత్యం జరిగే పనులకు కాంట్రాక్టు ...ష్టం ఉండకూడదు. కాబట్టి కాంట్రాక్టు లేబర్ యాక్ట్ క్రింద ప్రభుత్వం ఈ హెల్పర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని ఒక జి.ఓ.ను జారీ చేసేట్లు ఒత్తిడి తీసుకొనిరావాలి. అయితే ఒక పరిమిత సంఖ్యలో ఉన్న హెల్పర్స్ ఈ పోరాటాన్ని ఒంటరిగా కొనసాగించటం కష్ట సాధ్యమయిన విషయం. ఒక సముద్రంగా ఉన్న రైల్వేలో హెల్పర్స్ యొక్క పాత్ర, సంఖ్య పరిమితమయింది. కాబట్టి మొత్తం రైల్వే కార్మికులు ఆందోళన నిర్వహించాల్సిన అవసరముంది. ఆందోళన, ఉద్యమం ద్వారానే ఇది సాధ్యమవుతోంది.

ఒక దేశ పౌరుని యొక్క జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికుంది. ఇంకా అనేక ఆదేశిక సూత్రాలను పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వానికుంది. ఇది రాజ్యాంగం యొక్క ఉద్దేశ్యం. బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడింది మొట్టమొదట ఆదివాసిలే. ఆ ఉద్యమాల యొక్క ఉదేశ్యాలతో, లక్ష్యాలతో తయారయిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రస్తుత ప్రభుత్వం "ఎవరి జీవనాధారాన్ని వారు వెతుక్కోవాలి దేశంలో ఆర్థిక సమస్యలున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్. షరతులను పాటించాల్సి వస్తోంది. మాకు ప్రజల జీవనాధారలతో సంబంధంలేదు'' అంటున్నాయి. కాని రాజ్యాంగం పెట్టుబడిదారులకు మేలు చేయమని గాని, ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్. ఆదేశాలకు అనుగుణంగా పని చేయమని గానీ చెప్పలేదు.

ఇప్పుడున్న ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులను విపరీతంగా ఆహ్వానిస్తున్నాయి. ఆ పెట్టుబడిదారులు "మీ దేశంలో కార్మిక హక్కులు మితి మీరి ఉన్నాయి" అని అభియోగం మోపుతున్నారు. ఇక్కడ కార్మికులు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వాళ్ళేమో 'అలా కాదు. మా ఇష్టం వచ్చినప్పుడు తీసుకుంటాం లేకపోతే తీసి వేస్తాము' అని అంటున్నారు. చివరకు వీరి పెట్టుబడుల కోసం ప్రభుత్వాలు తమ పరిపాలనను మార్చుకొంటున్నాయి. ఈ విధంగా ఇవాళ్టి వాతావరణం మనకు వ్యతిరేకంగా ఉంది. మన డిమాండ్లు ఈ నేపధ్యంలో సంక్లిష్ట దశలో ఉన్నాయి.